క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కృత్తివెన్ను: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. మంగళవారం చినగొల్లపాలెం ఏటిమొండిపాలెం వద్ద జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు వాటాడి సుబ్బారావు, కొప్పాడి బాలరాజు, కొప్పాడి సత్యనారాయణ, బొడ్డు సత్యనారాయణ, తిరుమాని భవానీలతో పాటు మరో 20 మంది మంత్రి జోగి రమేష్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల నాయకులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు కిట్టు పరామర్శ

మచిలీపట్నంటౌన్: గరాలదిబ్బలో జరిగిన ఘటనలో గాయపడి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడుగు రాజ్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు మంగళవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, మన్నే శేషయ్య పాల్గొన్నారు.

ఘటం కుండకు పూజలు

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెంలోని గ్రామ దేవత నూకాలమ్మ సంబరం సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూకాలమ్మ ఘటం కుండను గ్రామంలో ఊరేగిస్తున్నారు. మంగళవారం జెడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు దంపతులు వారి ఇంటివద్ద ఘటం కుండకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు కళాకారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమ పూజ జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు శ్రీహరి అమ్మవారికి అలంకరణ చేసి పూజలు జరిపారు. గ్రామానికి చెందిన 60 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయంలోని అమ్మవారికి సెప్టెంబరు 1వ తేదీన చందనోత్సవం నిర్వహిస్తామని ధర్మకర్త నిరంజనరావు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు మేలు

వక్కలగడ్డ(చల్లపల్లి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి ఉత్తమ ఉత్పత్తులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ వల్లూరు ఉమ అధ్యక్షతన ఉత్తమ ఉత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. శ్యామల మాట్లాడుతూ వెద సాగు పాటిస్తున్న రైతులు కలుపు నివారణకు, ఎరువులు అందించే క్రమంలో నూటీ ఎరువుల వాడకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నత్రజని ఎకరాకు 75 కిలోలు మూడుసార్లుగా అందిస్తే పంట పిలక చేసే దశలో ఆరోగ్యకరంగా ఉంటుందని చెప్పారు. పొటాషియం రెండు దఫాలుగా అందిస్తే మొక్కకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏడీఏలు కె.శ్రీనివాసరావు, ఎస్.శ్యామల, ఏఓ జి.సాయిసింధు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దానానికి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం గ్రామస్తులు ఆంద్రు సాంబశివరావు, పద్మావతి దంపతులు వారి కుమారుడు ఆంద్రు సత్యశ్రీహర్ష, ఆంద్రు హరిప్రియ ఆధ్వర్యంలో రూ. 75 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. మంగళవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న ఆంద్రు కుటుంబ సభ్యులు స్వామి వారి నిత్యాన్నదానంలో పాల్గొన్నారు.

సేఫ్ హోం పరిశీలన

కృత్తివెన్ను: వివిధ కారణాలతో ఇబ్బందులకు గురైన 18 ఏళ్లలోపు బాలికలను సేఫ్ హోంలో ఉంచుతామని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అన్నారు. మంగళవారం పోడు గ్రామంలోని న్యూ హారిజోన్ సేఫ్ హోంను కమిషన్ బృందం పరిశీలించింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కమిషన్ సభ్యులు బి. పద్మావతి, జె. రాజేంద్రప్రసాద్, జి. సీతారాం తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాల వద్ద నివాళి
- విద్యార్థులకు వివిధ పోటీలు



పల్లోటి స్కూల్‌లో సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

పెడన: తెలుగు భాషలోని తియ్యదనాన్ని సామాన్య ప్రజలకు పరిచయం చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని పలువురు వక్తలు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం మంగళవారం పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారుల నుంచి ఉపాధ్యాయుల వరకు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. జెడ్పీహెచ్ఎస్ ప్లస్ చెన్నూరు హెచ్ఎం సిద్దినేని సౌజన్య ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి తెలుగు భాషా పత్రిక తెలుగు తేజం నాలుగో సంచికను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఎవరి భాషను వారు నేర్చుకుని అందులోని మాధుర్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు, పత్రికా సంపాదకులు కలిదిండి రాంబాబు, పరిశే రాజేశ్వరరావు, రవిశంకర్, అనంత వెంకటేశన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- చేవేంద్ర జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగుభాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు బసవేశ్వరరావు ఆధ్వర్యంలో సామెతలు, కథలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు తల్లిగా దుంపల సిరి, గిడుగు రామ్మూర్తి పంతులుగా కార్తికేయ, పోతనగా వెంకట శివ సాయి, కవయిత్రి మొల్లగా వేదలతశ్రీల వేషధారణలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.
- సెయింట్ విన్సెంట్ పల్లోటి ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తెలుగుదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరై ఆకట్టుకున్నారు. పలువురు విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.
- బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొమ్మారెడ్డి, టాలెంట్ హైస్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్మోహనరావు, పాఠశాల డైరెక్టర్లు కొమ్మారెడ్డి కిషోర్, సాబూజాన్‌లు మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
- చల్లపల్లి: తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు కృషి తెలుగు భాషకు వరంగా నిలిచిందని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. రామ్మూర్తి చిత్రపటానికి మాధవేంద్రరావు, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు.
- గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎస్.పద్మజాదేవి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషాభ్యున్నతికి చేసిన కృషిని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తెలుగు భాష తియ్యదనంపై నృత్య ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వేసిన పరమానందయ్య శిష్యులు నాటకం ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు టి.ఖాదర్ మస్తాన్, బీఎస్‌సీ బోస్, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

అమ్మభాషకు వందనం ..

కోడూరు: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అమ్మభాషకు అక్షర వందనం సమర్పించారు. మండలంలోని విశ్వనాథపల్లి ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థినులు 'అ' అక్షర రూపంలో కూర్చొని తెలుగు భాష పట్ల తమకున్న అభిమానాన్ని చాటారు. ముందుగా తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. కోడూరు మెయిన్, ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాలల్లో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం రవివర్మ, ఉపాధ్యాయులు బాల రమేష్, రాంబాబు, సాంబశివయ్య, నాగరాజు, నాగసుష్మ పాల్గొన్నారు.



కొమ్మారెడ్డి పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అవనిగడ్డ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

భాషపైనే జాతి మనుగడ ఆధారం

అవనిగడ్డ: స్థానిక గాంధీ క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతి మనుగడ భాషపై ఆధారపడి ఉంటుందని, భాషను రక్షించుకోలేక పోతే జాతి కూడా మనుగడ కోల్పోతుందని చెప్పారు. స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె. ప్రభుదాస్ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. రీ సర్వేలో భాగంగా మండలంలో గురిజేపల్లి గ్రామంలో ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇప్పటికే సర్వే రాళ్లు వేయించే కార్యక్రమం చేపట్టామన్నారు. త్వరలో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు అవసరమైన ఈ కేవైసీ పత్రాలు సమర్పించే ప్రక్రియ గ్రామ వీఆర్వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేగవంతంగా జరుగుతోందని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయితే రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు.

డీవైఈఓ కార్యాలయం ప్రారంభం



డీవైఈఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాల ఎదురుగా ఉన్న సోడా, బీడీ, కిళ్లీ వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన మచిలీపట్నం డివిజనల్ విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. డీఆర్వో మాట్లాడుతూ డీవైఈఓ కార్యాలయంలానే ఇతర శాఖల అధికారులు ఈ కాంపౌండ్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ యూవీ సుబ్బారావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జరిగితే మరోసారి ఆశీర్వదించండి

మంత్రి జోగి రమేష్




చినగొల్లపాలెంలో వృద్ధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలు జరిగింది అని అనుకుంటే తప్పకుండా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు మంత్రి జోగి రమేష్ కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామ సచివాలయం-1 పరిధిలోని బత్తుల వారి బజారు, సానా వారి వీధి, దేశాబత్తుల పేట, క్రిస్టియన్ పేట, రైతుల పేట, యేటిపవరు తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం మేర నెరవేర్చారని చెప్పారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి మంచి నాయకుడిని మళ్లీ మనం ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. చిన గొల్లపాలెం సచివాలయం-1 పరిధిలో సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. క్రిస్టియన్ పేటలో శ్మశాన వాటికకు వెళ్లే దారి కోసం ఒక సెంటు భూమిని కొంటామని, అలాగే ఆ మార్గాన్ని మెరక చేస్తామని చెప్పారు. ఎక్కడైతే వీధిలైట్లు వెలగడం లేదో ఆయా ప్రాంతాల్లో వెలిగేలా చేస్తామని, వర్షాకాలంలో నీటితో మునిగిపోతున్న రహదారిని మెరక చేయించి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. చినగొల్లపాలెంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కొట్టు రామకృష్ణ కుటుంబ సభ్యులకు ఎంపీపీ గరుడప్రసాద్ ఆయన కుమారుడు వంశీకృష్ణ పేరు మీదుగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సునీల్, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బి. మహేష్, భూపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు ఎస్. బాబ్జీ, సత్యనారాయణ, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడలతో సమాజంలో గుర్తింపు

ఎమ్మెల్యే సింహాద్రి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: క్రీడల ద్వారా సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సబ్ జోన్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బహుమతులు అందించారు. ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్‌నాయుడు, ఎంఈఓ ఎస్. శివశంకరరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోసూరు పూర్ణచంద్రరావు, గరికపాటి మారుతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందాలి



అవనిగడ్డలో క్రీడాజ్యోతితో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరికృష్ణ, మత్తి అరుణ తదితరులు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- అవనిగడ్డలో వంద అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ

అవనిగడ్డ: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. హాకీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని అవనిగడ్డలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఐదువేల మంది విద్యార్థులతో మానవహారం, ప్రధాన రహదారి వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వంద అడుగుల భారీ జాతీయ పతాకాన్ని మైదానంలో ఆవిష్కరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావచ్చని చెప్పారు. మన దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో ఐదు వేల మంది విద్యార్థులతో నిర్వహించిన మానవహారం ఆకట్టుకుంది. అనంతరం కళాశాల మైదానం నుంచి కోర్టు సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 500 అడుగుల భారీ జాతీయ పతాకాలు, విద్యానికేతన్, పులిగడ్డ ఏపీ రెసిడెన్షియల్‌కు చెందిన మరో భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్ఆర్ఐ వికాస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు బ్యాండు మేళం, కర్రసాముతో ఆకట్టుకున్నారు. 500 జాతీయ పతాకాలను పట్టుకుని రెండు కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీ జాతీయ భావాన్ని పెంపొందించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘంటా శ్రీనివాసరావుతో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈఓలు ఎన్. శివశంకరరావు, అన్నపరెడ్డి పిచ్చయ్య, శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు, అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి కోసూరు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన: మండల పరిధి నందమూరు శ్రీ వాసవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్పోర్ట్స్ సెల్ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దొనపాటి బాబా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసరెడ్డి, కళాశాల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ గిరిఫణికుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంపొందాలి..

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలను అల వాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫీస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవ నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పర్చూరి గోపి, కవిత ఇతర ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రవణం హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు హాకీ శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ మత్తి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపు దరఖాస్తుల పునఃపరిశీలన

పెడన: ఓటర్ల సమగ్ర సర్వే ప్రక్రియ పూర్తి కావడంతో తొలగింపులకు వచ్చిన దరఖాస్తుల విషయంలో ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందుకు గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి పద్మావతిని ప్రత్యేక అధికారిగా నియమించడంతో ఆమె మంగళవారం పెడన పట్టణంలో తొలగింపు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు 1,400 వరకు రావడంతో వీటికి సంబంధించి పూర్తి ఆధారాలు ఏ విధంగా ఉన్నాయి, వాటిల్లో వాస్తవం ఎంత అనే దానిపై ఆర్డీఓ పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తహసీల్దార్ మధుసూదనరావు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ కల్పన, పురపాలక సంఘం టీపీఓ ఏసుబాబు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నెల రోజుల పాటు పోలింగ్ స్టేషన్ల పరిశీలన..

పెడన నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లను నెల రోజుల పాటు పరిశీలిస్తామని ముడా వైస్ చైర్మన్, పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీఎల్ఓలతో కలిసి ఓటరు జాబితాలను పట్టుకుని క్లయిమ్‌లను పరిశీలించి మాట్లాడారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ నుంచి కొత్తపేటకు వెళ్లే రహదారి సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల హనుమంతరావు భూమి పూజ నిర్వహించారు. రూ.2.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరు శేఖరు, రమణారావు, పెద్దు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

కోనేరుసెంటర్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బందరు మండలం గరాలదిబ్బ గ్రామానికి చెందిన ఒడుగు రాజ్‌కుమార్ చేపల వేటకు వెళుతుంటాడు. సోమవారం రాత్రి గ్రామంలోని గుడి వద్ద రాజ్‌కుమార్ ఒంటరిగా కూర్చుని ఉండగా ఐదుగురు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. రాజ్‌కుమార్ భయంతో ఒంటిపై దుస్తులను తీసివేసి పరుగున ఇంటికి వెళ్లిపోయాడు. అప్పటికే అతని శరీరం కొంత మేర కాలడంతో చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బడి ఈడు పిల్లలు విద్యాలయాల్లోనే ఉండాలి

పెడన: బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా విద్యాలయాల్లో ఉండాలని మచిలీపట్నం డీఎల్‌డీఓ పద్మ అన్నారు. మంగళవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా బడిఈడు పిల్లలను గుర్తించి ఇంకా ఎవరైనా బయట ఉంటే వారిని తక్షణం సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఎంఈఓ-2 వైవీ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

పెడన: పట్టణంలోని ముత్యాలమ్మ ఘటం అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం 7.02 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం జరిగింది. పాతపేట మహిళా భక్త బృందం అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు. ఊటుకూరు శ్రీగిరి, తోట పైడియ్య తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దేవాలయాలకు ఈఓలను నియమించాలి

నాగాయలంక: మండలంలోని దేవాలయాలకు ఈఓలను నియమించాలని గణపేశ్వరం దుర్గమ్మ-గణపేశ్వరస్వామి దేవాలయాల చైర్మన్ మండల రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గణపేశ్వరం దుర్గమ్మ ఆలయం, భావదేవరపల్లి భావన్నారాయణ స్వామి దేవస్థానం, సంగమేశ్వరంలోని సంగమేశ్వర స్వామి తదితర ఆలయాలకు దేవదాయ శాఖ పర్యవేక్షణ లేదన్నారు.నాగాయలంక మండలంలోని దేవాలయాలకు బాధ్యునిగా ఎన్టీఆర్ జిల్లా నంది గామకు చెందిన కార్యనిర్వహణాధికారిని నియమించారని చెప్పారు. అందుబాటులో లేని అధికారులను ఇక్కడ నియమించడంతో ఆలయాల అభివృద్ధి, మనుగడకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

అరుణాచలం బస్సు యాత్ర ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి 9వ సారి ఏర్పాటు చేసిన బస్సు యాత్రను డిపో మేనేజర్ కె. హనుమంతరావు మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆర్టీసీ సర్వీసును ఆదరించిన యాత్రికులకు ధన్యవాదాలు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

పెడన: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మడక, నందమూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలను మంగళవారం ఆయన సందర్శించి పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనియన్ సేవలను వివరించారు.